క్లుప్తంగా

ఎమ్మెల్యే వసంత పూజలు



మైలవరం: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ శుక్రవారం శ్రీమహిషాసురమర్దనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దర్శించుకుని పూజలు జరిపించారు. వేద పండితులు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు.

మహా అన్నసమారాధన

గంపలగూడెం: విజయ దశమి వేడుకల్లో భాగంగా మండలంలోని పలు చోట్ల ప్రత్యేక నవరాత్రి శిబిరాల్లో శుక్రవారం 9వ రోజు భక్తులకు అన్న సంతర్పణ చేశారు. గంపలగూడెం గాంధీ సెంటర్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, కాపులవీధిలో భవానీ భక్త బృందంచే అన్న సమారాధన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

టెన్త్ విద్యార్థులకు శిక్షణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఒకేషనల్ కో–ఆర్డినేటర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పాఠశాలలో ఒకేషనల్ విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పాఠ్యాంశంలో భాగంగా ఒకేషనల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్‌పై ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. చదువుతోపాటు ఐటీ రంగాల్లో కూడా ప్రావీణ్యం పొందాలని చెప్పారు.

రెచ్చిపోతున్న కలప దొంగలు

కలప దొంగలు రెచ్చిపోతున్నారు. రహదారుల వెంబడి చెట్లను అడ్డూ,అదుపూ లేకుండా నరికేస్తున్నారు. కలపను టింబర్ డిపోలకు తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. దశాబ్దాలుగా రహదారుల వెంబడి పెరుగుతున్న వృక్ష సంపద తరిగిపోతున్నా అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- విద్యుత్ తీగల పేరుతో చెట్ల నరికివేత
- రహదారుల వెంబడి కనుమరుగవుతున్న వృక్ష సంపద



హెచ్. ముత్యాలంపాడు గ్రామం వద్ద తుమ్మచెట్టును మిషన్ రంపంతో కట్ చేస్తున్న టింబర్ డిపో కార్మికులు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెల్లటూరు వద్ద రహదారిపై వంగిన చెట్లను నరికి తరలిస్తున్న కూలీలు (ఫైల్)

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధి హెచ్. ముత్యాలంపాడు గ్రామం వద్ద రహదారి పక్కన ఉన్న తుమ్మ చెట్లను వెలగలేరుకు చెందిన ఓ టింబర్ డిపో కార్మికులు మిషన్ రంపంతో శుక్రవారం ఉదయం నుంచి కోయడం ప్రారంభించారు. దీనిపై కార్మికులను 'సాక్షి' ప్రశ్నించగా విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాలతోనే నరికి వేస్తున్నామని చెప్పారు. విద్యుత్ తీగలకు అడ్డు వస్తే కొమ్మలను నరుకుతారు తప్ప చెట్లను నరకేందుకు మీకు అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించగా.. చెట్ల నరికివేతను నిలిపివేశారు.

ఇటుక బట్టీలకు కలప తరలింపు

స్థానికంగా ఇటుక బట్టీలు ఉండడంతో కలప అవసరాన్ని బట్టి రహదారుల పక్కన ఉన్న చెట్లను నరికి తరలిస్తున్నారు. చెట్లను నరికిన తర్వాత పెద్ద పెద్ద మొద్దులను టింబర్ డిపోలకు తరలించి చెక్కలుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి లేకుండా చెట్లను నరకడం చట్టరీత్యా నేరం కనుక విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయంటూ చెట్లను శాశ్వతంగానే నరికేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులపై పడిన చెట్లు, వాలిన కొమ్మలను నరికివేసి ఇటుక బట్టీలకు తరలించి కలప దొంగలు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జి.కొండూరు నుంచి ఆత్కూరు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని నరికివేసి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారని విద్యుత్ శాఖాధికారులపై ఆరోపణలు వచ్చాయి.

ఆర్‌అండ్‌బీ శాఖ ఆదాయానికి గండి

జి.కొండూరు నుంచి కందులపాడు వరకు కేజీవై రహదారి, వెలగలేరు నుంచి గణపవరం వరకు ఉన్న విజయవాడ-విసన్న పేట రహదారికి ఇరువైపులా ఉన్న తుమ్మ, నిద్రగన్నేరు, నేరేడు చెట్లను కలప దొంగలు దశల వారీగా నరికి తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కలప దొంగలు అనుమతులు లేకుండా చెట్లను నరికి తరలించడం వల్ల వృక్ష సంపద తరలిపోవడంతో పాటు ఆర్‌అండ్‌బీ శాఖకు అందాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

నష్టపరిహారం చెల్లించాలి: సీపీఎం

మైలవరం: వరద బాధితులు, రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మైలవరం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలకు ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎన్యూమరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా మందికి పరిహారం అందలేదని చెప్పారు. బాధితులందరికీ నష్ట పరిహారం అందించాలని, మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోలాహలంగా బతుకమ్మకు పూజలు

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో విజయ దశమి పండుగ సందర్భంగా బతుకమ్మకు శుక్రవారం కోలాహలంగా పూజలు చేశారు. గంపలగూడెం గాంధీ సెంటర్, రావిచెట్టు బజారు, దళితవాడ, బీసీ కాలనీ, పెనుగొలను శివాలయం సమీపంలో, వినగడప పంచముఖ సుందర హనుమత్ పీఠం వద్ద, ఆర్లపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద, ఊటుకూరు తదితర గ్రామాల్లో నవరాత్రి శిబిరాల్లో బతుకమ్మకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. నెలకొల్పిన బతుకమ్మ చుట్టూ మహిళలు చేరి అమ్మవారి పాటలు పాడుతూ, ఆటలు ఆడారు. ఇంటివద్ద తయారుచేసి తీసుకువచ్చిన పిండి వంటకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.





16 దుకాణాలకు 850 టెండర్లు

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్‌లో మద్యం దుకాణాలకు టెండర్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. 16 దుకాణాలకు 850 టెండర్లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆన్‌లైన్, ఆఫ్ లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసేవారు డిమాండ్ డ్రాఫ్ట్ తీసి తమ కార్యాలయంలో అందజేశారని చెప్పారు.

మైలవరం పరిధిలో 485 దరఖాస్తులు..

మైలవరం: మైలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 4 మండలాలకు 10 మద్యం షాపులకు సంబంధించి 485 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలంలోని 4 షాపులకు 260 దరఖాస్తులు రాగా, జి.కొండూరు మండలంలోని 4 షాపులకు 154, రెడ్డిగూడెం మండలంలో రెండు 2 షాపులకు 71 దరఖాస్తులు అందాయని వివరించారు. ఎన్టీఆర్ జిల్లాలోని 113 షాపులకు విజయవాడ గురునానక్ కాలనీలోని ఎస్ఏసీ కల్యాణ మండపంలో లాటరీ తీస్తారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గడ్డమణుగు శివారులో పగిలిన పైప్‌లైన్

వృథాగా పోతున్న కృష్ణా జలాలు



జి.కొండూరు: మండల పరిధి గడ్డమణుగు గ్రామ శివారులో కృష్ణా వాటర్ పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. పైపులైను నుంచి లీకవుతున్న నీరు రహదారిపైకి రావడంతో రహదారి మొత్తం జలమయమై వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఈ పైపులైను జి. కొండూరు నుంచి గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు వరకు 18 కిలో మీటర్ల మేర ఉన్న ప్రధాన పైపులైను కావడంతో ఎగువున ఉన్న గ్రామాలకు కృష్ణా వాటర్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. అధికారులు వెంటనే స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేపడితే నీటి వృథాను అరికట్టడంతో పాటు ఎగువ గ్రామాలకు నీటి కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుంది.



జయజయహే మహిషాసురమర్దని

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవార్లు మహిషాసురమర్దని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలు తది దశకు చేరుకోవడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాలు, పందిళ్ల వద్ద అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అంతటా పండుగ శోభ సంతరించుకుంది. మూలపాడులో శాంతిహోమం నిర్వహించారు. ఆలయ కమిటీలు, ఉత్సవాల నిర్వాహకులు పర్యవేక్షించారు. - సాక్షి నెట్‌వర్క్



కొటికలపూడి రామాలయం వద్ద మహిషాసురమర్దనిగా అమ్మవారు



కిలేశపురంలో మహిషాసురమర్దనిగా అమ్మవారు



మైలవరంలో మహిషాసురమర్దనిగా కనకదుర్గమ్మ



గంపలగూడెం భజన మందిరంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి





మెట్టగుట్టపై సౌభాగ్యలక్ష్మిగా గజలక్ష్మీదేవి




ఊటుకూరులో స్థిరలక్ష్మిగా రాజ్యలక్ష్మీదేవి



గుళ్లపూడిలో మహిషాసురమర్దనిగా కనకదుర్గమ్మ



వినగడప పంచముఖ సుందర హనుమత్‌పీఠంలో అమ్మవారు




తిరువూరు కూరగాయల మార్కెట్‌లో మహిషాసురమర్దనిగా..



తిరువూరు రామాలయం రోడ్డులో అమ్మవారికి భక్తుల పూజలు



తిరువూరు బైపాస్‌రోడ్డులో మహిషసురమర్దని అలంకారం



కాచవరం రామలింగేశ్వర ఆలయంలో అమ్మవారి అలంకరణ

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd. ... [illegible]

T.V.N. వాసుదేవరావు

తేది.11-10-2024

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

తిరువూరు: స్థానిక ఐడియాస్ సేవా సంస్థలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికా విద్య, బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలను ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి వివరించారు. యుక్త వయస్సు రాకుండా ఆడపిల్లలకు పెళ్లి చేయవద్దని, వారిని అవకాశం ఉన్నంతవరకు చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. సామాజికంగా బాలికలకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: ఇసుక లోడుతో వెళుతున్న రెండు ట్రాక్టర్లను దాములూరు శివారు (పరిటాల) ప్రాంతంలో కంచికచర్ల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సంబంధిత రికార్డులు డ్రైవర్ల వద్ద లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు విజయవాడ శరన్నవరాత్రి ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తుండగా సందట్లో సడేమియా లాగా కూటమి నాయకులు ఇసుక దందాకు దిగారు.

క్లుప్తంగా

మేకా ప్రతాప్ దసరా శుభాకాంక్షలు



నూజివీడు: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతి రూపంగా నిలిచే విజయదశమి వేడుకలను నియోజకవర్గంలోని ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నామని చెప్పారు. ప్రజలంతా కలిసిమెలిసి ఉండి శాంతియుతంగా జీవిస్తూ అభివృద్ధిలో ముందుకు సాగాలని కోరుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చాట్రాయి: కిశోర బాలికలు ఆరోగ్య పరిరక్షణకు తగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీ దేవి అన్నారు. మండలంలోని చాట్రాయి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బాలికలను సన్మానించారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.


నిందితుడిపై కేసు

ముసునూరు: అక్కిరెడ్డిగూడెంకు చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన జంధ్యాల రాంబాబు, నాగరాజులు ఫోన్ చేసి వేధిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. గ్రామంలో ఆమెపై అసత్య ప్రచారం ప్రారంభించారు. శుక్రవారం ఆమె ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దసరాకు ఆంధ్రా మైసూర్ ముస్తాబు

జమీందారుల ఏలుబడిలో భాగంగా ఏడు సంస్థానాలకు రాజధానిగా భాసిల్లి చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన నూజివీడు దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూర్‌గా పేరొందింది. శనివారం రాత్రి జరుగనున్న ఉత్సవాలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలిరానున్నారు.

- నూజివీడులో నేడు ఉత్సవాలు
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- సాయంత్రం 5 గంటల నుంచి భారీ వాహనాలకు అనుమతి లేదు



విద్యుత్ దీపాల అలంకరణలో కోట మహిషాసురమర్దని ఆలయం



ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న ఐరావతం



సందడి చేయనున్న బుట్టబొమ్మలు

నూజివీడు: దసరా ఉత్సవాలకు నూజివీడు ముస్తాబైంది. రాచరికపు కోటలకు నిలయంగా ఉన్న నూజివీడును శత్రువుల భారి నుంచి పరిరక్షించి, ప్రజలందరినీ చల్లగా చూసేందుకు జమీందారులు కోట ప్రాకారంలో మహిషాసురమర్దని ఆలయాన్ని నిర్మించారు. కోట ప్రాకారంలో ఆలయం ఉండటంతో కోట మహిషాసురమర్దని ఆలయంగా ప్రసిద్ధి కెక్కింది. విజయ దశమి రోజున శనివారం గరుడ వాహనం, ఐరావతం, బుట్ట బొమ్మలు, కోలాట నృత్య ప్రదర్శనలు, చిత్ర, విచిత్ర వేషధారణలతో వైభవంగా ఉత్సవాలు జరుగనున్నాయి. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్ వద్ద జమీందారీ వారసులు జమ్మికొట్టి దసరా ఉత్సవాలను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు రాత్రంతా వీధుల్లో తిరుగుతూ ప్రజలను రంజింపజేస్తుంది. శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో పోలీసు అధికారులతో ఆయుధ పూజ నిర్వహించిన అనంతరం రాత్రి 10 గంటల నుంచి అమ్మవారు హంస వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరతారు. ఈ ఉత్సవంలో గరగ నృత్యం, బేతాళ సెట్టు, కర్రలపై మనుషుల నడక, శక్తి వేషాలు, కోలాటం, కత్తిసాము, కర్రసాము, నారసాల వంటి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వరకు బొమ్మల దుకాణాలు వెలిశాయి. హనుమాన్‌జంక్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఉత్సవాలకు ఉయ్యూరు రాజా నాంది

దాదాపు వందేళ్ల కిందట నూజివీడులో దసరా ఉత్సవాలకు ఉయ్యూరు ఎస్టేట్ రాజా శ్రీకారం చుట్టినట్లు చరిత్ర చెబుతోంది. ఉయ్యూరు ఎస్టేట్ సంస్థానాధీశులైన రాజా రంగయ్యప్పారావు వారి సంస్థాన ద్వారం గుర్రాల గేటు వద్ద ఉన్న ఆయుధాగారంలోని ఆయుధాలకు ఎస్టేట్‌లోని జమ్మిచెట్టు వద్ద పూజ చేసి దసరా ఉత్సవాన్ని ప్రారంభించే ఆనవాయితీ నాటి నుంచి కొనసాగుతోంది. ఉయ్యూరు రాజా హయాంలో అన్ని ఎస్టేట్‌లకు చెందిన ఏనుగులు అంబారీ, ఒంటెలు, గుర్రపు స్వారీలతో పెద్ద ఊరేగింపు జరిగేది. కోలాటాలు, కత్తి సాము, గారడీలు, మేజువాణిలతో ఎంతో ఉత్సాహ పూరితమైన వాతావరణంలో ఉత్సవాలు జరిగేవి. ఈ ఉత్సవాల్లో బుట్టబొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. రాజా రంగయ్యప్పారావు తదనంతరం రాజా వెంకటాద్రి అప్పారావు మైసూర్ మహారాజా ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలను మైసూర్ వెళ్లి తిలకించారు. అక్కడి ఉత్సవాల్లో బుట్ట బొమ్మలను చూసి మంత్రముగ్ధుడైన ఆయన ఆ తరహాలోనే బుట్ట బొమ్మలను ప్రత్యేకంగా తయారు చేయించి నూజివీడులో జరిగే ఉత్సవాల్లో ప్రదర్శింపజేయడం ఆనవాయితీగా మారింది.

భారీ పోలీస్ బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయంలో క్యూలైన్ల వద్ద పోలీసు సిబ్బందితో పాటు ఎన్‌సీసీ క్యాడెట్లను, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. శనివారం సాయంత్రం 6 నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు లారీలు, భారీ వాహనాలను పట్టణంలోకి రాకుండా పోలీసు అధికారులు నిషేధం విధించారు.

ఘనంగా ప్రతాప్ అప్పారావు జన్మదిన వేడుకలు



ప్రతాప్ అప్పారావుకు శుభాకాంక్షలు చెబుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ దంపతులు

నూజివీడు: నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన కార్యాలయం ఉన్న ద్వారకా ఎస్టేట్‌కు ఉదయం నుంచే నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివచ్చారు. నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల నుంచి తరలివచ్చి ప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రతాప్ అప్పారావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యానారాయణ, సీనియర్ నాయకులు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, పార్టీ ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, మిద్దే బాలకృష్ణ, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు పిల్లా చరణ్, నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విచ్చేసి ప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

పైప్‌లైన్ ఏర్పాటుకు టెండర్లు ఖరారు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో గత పదేళ్లుగా తీరని సమస్యగా ఉన్న వ్యర్థజలాలను తరలించే పైపులైన్ నిర్మాణ పనుల ప్రారంభానికి మార్గం సుగమమైంది. రూ.3 కోట్లతో పైప్‌లైన్ నిర్మాణానికి మున్సిపాలిటీ ఇటీవల పిలిచిన టెండర్లు ఖరారయ్యాయి. ఈ మేరకు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డిలు ఒప్పందాలపై సంతకాలు చేశారు. గతంలో పైప్‌లైన్ నిర్మాణానికి ఐదారుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ట్రిపుల్ ఐటీ నుంచి పెద్దచెరువు అలుగు వరకు భూమిలో పైప్‌లైన్‌ను నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్ ద్వారా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ట్రీట్‌మెంట్ చేసిన అనంతరం పైప్‌లైన్ ద్వారా వెలుపలికి పంపుతారు. ఇప్పటివరకు పైప్‌లైన్ లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా మురుగు నీటిని బయటకు తరలిస్తున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్న పని కావడంతో పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి చర్యలు చేపట్టారు.

బాలికల హక్కులపై ప్రజా చైతన్యం

ఆర్డీఓ వాణి



మాట్లాడుతున్న ఆర్డీఓ వాణి

నూజివీడు: బాలికలపై లైంగిక దాడులను అరికట్టి, వారి హక్కులపై ప్రజలను చైతన్య పరచడమే అంతర్జాతీయ బాలికా దినోత్సవం ముఖ్య ఉద్దేశమని ఆర్డీఓ మొవిడి వాణి అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ఆర్డీఓ మాట్లాడుతూ బాలికల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే 112కి కాల్ చేయాలని, లేకుంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్నేహ రైడ్స్ అనాథ పిల్లల వసతిగృహం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారిని ఆర్డీఓ వాణి అభినందించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎస్వై నూరానీ, తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీఓ సి.రాఘవేంద్రనాథ్, స్నేహ రైడ్స్ సంస్థ చైర్మన్ బసవరాజు నగేష్ పాల్గొన్నారు.

నూజివీడు నియోజకవర్గంలో 672 దరఖాస్తులు



నూజివీడు: నియోజకవర్గంలోని మొత్తం 16 మద్యం దుకాణాలకు గడువు ముగిసేలోగా 672 దరఖాస్తులు వచ్చాయని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.13.44 కోట్ల ఆదాయం లభించిందన్నారు. ఆఖరి రోజున సుమారు 100 దరఖాస్తులు రావడం గమనర్హం. కొందరైతే సిండికేట్ అయ్యి 10 నుంచి 15 వరకు దరఖాస్తులు పెట్టారు. వీరిలో ఏ ఒక్కరికి షాపు వచ్చినా అందరికీ వాటాలు ఇచ్చే విధంగా ఒప్పందానికి వచ్చి సిండికేట్ అయినట్లు తెలిసింది.

శోభనాచలుడిని దర్శించుకున్న ప్రతాప్ అప్పారావు



లక్ష్మీ నరసింహుడిని దర్శించుకున్న మేకా ప్రతాప్

ఆగిరిపల్లి: నూజివీడు మాజీ ఎమ్మెల్యే, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జన్మదినం సందర్భంగా స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శేషుబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతాప్ అప్పారావుకి తీర్థ ప్రసాదాలను, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ సభ్యులు పి. వీరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, నాయకులు ఈలప్రోలు సుబ్బయ్య, బోయపాటి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సాదం గోపి, పల్లె రవీంద్రారెడ్డి, పార్టీ ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షుడు రవి శేఖర్, సర్పంచులు సంజీవరావు, రాజు, పురుషోత్తం, ఆగిరిపల్లి గ్రామ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

జయజయహే మహిషాసురమర్దని

నూజివీడు: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు అమ్మవార్లు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూజివీడులో కోట మహిషాసురమర్దని అమ్మవారు శుక్రవారం అమ్మవారి నిజస్వరూపమైన మహిషాసురమర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేకువ జాము నుంచి ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక జంక్షన్ రోడ్డులోని సర్వసతీ ఆలయం, బస్టాండ్ వద్ద శివాలయం, 32వ వార్డులోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, 5వ వార్డులోని గంగానమ్మ ఆలయాల్లోని అమ్మవారు మహిషాసురమర్దని అలంకరణలో దర్శనమిచ్చారు.

- **చాట్రాయి:** మహిషాసురమర్దనీ దేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చాట్రాయి, ఆరుగొలనుపేట గ్రామాల్లో భక్తులకు అన్నదానాలు చేశారు.
- **బలివే(ముసునూరు):** బలివేలోని ప్రసిద్ధ బలే రామలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు, గోవవరం కాశీ విశ్వేశ్వరాలయం, ముసునూరు తూర్పు, పడమటి రామాలయాల వద్ద, చెక్కపల్లి, గుడిపాడు, వేల్పుచర్ల, రమణక్కపేట శివాలయాల్లో అమ్మవారికి మహిళలు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. లోపూడిలోని కోదండ రామాలయం వద్ద భవానీ దీక్షాదారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



మహిషాసురమర్దని అలంకరణలో కోట మహిషమ్మ



లోపూడిలో కోదండ రామాలయం వద్ద అమ్మవారి అలంకరణ



చాట్రాయిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆగిరిపల్లి రజక వీధిలో మహిషాసురమర్దనిగా..



బలివేలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

ప్రకటన

[illegible] Shriram Finance Ltd. [illegible]

నూజివీడు T.V.N. వాసుదేవరావు
తేది.11-10-2024 అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 51482